విశాలాంధ్ర కృష్ణా జిల్లా

ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించండి : కలెక్టర్

విశాలాంధ్ర-మచిలీపట్నం : రహదారులపై ఉన్న ధాన్యాన్ని వెంటనే వాహనాలు ఏర్పాటు చేసి మిల్లులకు తరలించాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ సంయుక్త కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్, జిల్లా అధికారులు, క్షేత్రాధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి ధాన్యం సేకరణ, ఓటర్ల జాబితా సవరణ, లంక భూముల పురోగతి తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారులపై రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్నారని, రెండు లేదా మూడు రోజులు అవగానే ఆ ధాన్యాన్ని వాహనాలకు ఎక్కించి ఆన్లైన్ ద్వారా మ్యాపింగ్ చేసి సంబంధిత మిల్లులకు తరలించాలన్నారు. ధాన్యాన్ని ఎక్కువ రోజులు రహదారులపై ఆరబెట్టకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఆరబెట్టుకున్న ధాన్యాన్ని తరలించేందుకు వాహనాలు లేవని, ఎవరు పట్టించుకోవడంలేదని ఆరోపణలు రాకుండా జాగ్రత్త వహించాలన్నారు. వాహనాల కొరత ఎట్టి పరిస్థితుల్లో రాకూడదని స్పష్టం చేశారు. వ్యవసాయ అధికారులు, వీఆర్వోలు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి రైతులతో మాట్లాడాలని, ధాన్యం ఎలాగుంది విచారించాలని, వారికి ధైర్యం చెప్పి ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని భరోసా కల్పించాలన్నారు. మిచౌంగ్ తుఫాను వలన దెబ్బతిన్న పంటల నష్టం వివరాలను ముమ్మరంగా ఎన్యుమరేషన్ చేపట్టి 18వ తేదీ కల్లా పూర్తి చేయాలన్నారు. ఆ వివరాలను 22వ తేదీ వరకు రైతు భరోసా కేంద్రాల్లో సామాజిక తనిఖీ కోసం అందుబాటులో ప్రదర్శించాలన్నారు. ఓటర్ల నమోదు, తొలగింపులు, మార్పులు చేర్పుల కోసం వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలన్నారు. లంక భూముల ఈ కే వై సి చేయడంలో నాగాయలంక వెనుకబడి ఉందని ఇకనైనా పురోగతి సాధించాలని కలెక్టర్ సూచించారు. ఈ టెలికాన్ఫరెన్స్లో పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఉయ్యూరు ఆర్డిఓ డి రాజు, మచిలీపట్నం గుడివాడ ఆర్డీవోలు ఎం వాణి, పద్మావతి, డిఎస్ఓ పార్వతి, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్ పద్మావతి, తహసీల్దారులు కమిషనర్లు, ఎంపీడీవోలు తదితర అధికారులు పాల్గొన్నారు.

రైతులకు తప్పని వేధన!

నీటిలోనే వరిపనలు... పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర-కూచిపూడి : వర్షానికి ముందు తాము పైరుకోసుకోవ డమేతాము చేసిన తప్పా? అంటూ వర్షానికి ముందు కోసి నీటిలో నాని పూర్తిగా దెబ్బతిన్న మొవ్వ మండలంలోనిరైతులు ఆందోళన తో ప్రశ్నిస్తు న్నారు. ప్రభుత్వం వర్షంతో ముంపుపాలై నష్టపోయిన రైతులను ఆదుకుం టామని ప్రచారం చేసి ఇప్పుడేమో కోయకుండా వర్షంలో ముంపు పాలై 33 శాతం పైన నష్టపోయిన రైతులకు మాత్రమేనష్టపరిహారం ప్రకటిం చడం దారుణమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొవ్వ మండలంలోని కాజ, కోసూరు, పెదముత్తేవి, అవురిపూడి, పాలంకిపాడు, చినముత్తేవి, అయ్యంకి పెదసనగల్లు, భట్లపెనుమర్రు, కూచిపూడి, పెదపూడి, బార్లపూడి, మొవ్వ , యద్దనపూడి, గూడపాడు, కొండవరం, నరసంపాలెం, కారకంపాడు గ్రామాలలో వర్షానికి ముందు కోసి వర్షపు నీటితో వరి పనలు మునిగిపోయిన రైతులందరూ ప్రభుత్వం నుంచి ఎంతోకొంత నష్టపరిహారం వస్తుందని ఎదురుచూస్తున్న రైతులకు ప్రభుత్వం చేసిన ప్రకటన ఆశాభంగమయింది. అప్పట్లో రైతులు ఎకరానికి నాలుగు వేల నుంచి 5వేల రూపాయల వరకు చెల్లించి కోతలు కోయించారు. వ్యవసాయ శాఖ మంత్రి రెండు నుంచి మూడు వేల లోపు ఎకరాలని పేర్కొంటుండగా సుమారు 5 వేల ఎకరాలకు పైనే ఉండవచ్చునని రైతులు పేర్కొంటున్నారు. ఆ విధంగా కోసిన కొన్ని గ్రామాలలోని పొలాలలో ఇప్పటికీ నీరుపోక గడ్డి గాని, ధాన్యం గాని ఎందుకు పనికిరాని స్థితిలో ఉన్నాయని గగ్గోలు పెడుతున్నారు. ఈ రకంగా వరి పరిస్థితి ఉంటే గ్రామాలలోని వ్యవసాయ శాఖఅధికారులు నిమ్మకు నీరు ఎత్తినట్లుగా వ్యవహరిస్తూ ఉన్నతాధికారులకు తమ కడగండ్లుతెలపకపోవడంతో పంట నష్టపరిహారాన్ని అందుకోలేని పరిస్థితి ఏర్పడుతోందని గగ్గోలు పెడుతున్నారు. ఈ పరిస్థితులలో వామపక్ష నేతలు తమ పరిస్థితిని అటుఅధికారుల దృష్టికి సైతం ఇటు ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి చేయూతనిప్పించాలని పేర్కొంటూ దీనికోసం రైతు సంఘాలు పాటుపడాలని కోరుతున్నారు.

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు విలువైనది

విశాలాంధ్ర-మచిలీపట్నం : ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు ఎంతో విలువైనదని, భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ వినియోగించుకుని దేశ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రాజాబాబు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవడంపై కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్ర ప్రదర్శనను ప్రారంభించారు. ఆయన పోలింగ్ కేంద్రంలో లో ఓటు వేసే విధానాన్ని స్వయంగా డెమో ద్వారా సందర్శకులకు వివరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటు వేసే విధానంపై ఓటర్లకు అవగాహన కలిగించేందుకు కలెక్టరేట్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ల ప్రదర్శన కేంద్రంను ఏర్పాటు చేశామన్నారు. ఇదే తరహాలో జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ఏర్పాటు చేశామని, ఈ కార్యక్రమం 40 రోజుల పాటు కొనసాగుతుందన్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రంలో బ్యాలెట్ యూనిట్,కంట్రోల్ యూనిట్, వి.వి ప్యాట్ లు ఉంటాయన్నారు. అదేవిధంగా ఇదే నమూనాను సంచార అవగాహన వాహనంలో ఏర్పాటు చేసి జిల్లాలోని అన్ని గ్రామాలలో తిప్పుతూ ప్రచారం చేస్తామని, ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ ప్రదర్శనలో తప్పనిసరిగా పాల్గొని ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పనితీరు, ఓటు వేసే విధానం తెలుసుకుని నమ్మకాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఓటు వేసే విధానంపై ప్రజలకు ఏ విధమైన సందేహాలు ఉన్నా సరే అవగాహన కేంద్రం వద్ద ఉన్న ఎన్నికల నమోదు అధికారులను అడిగి తెలుసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి నాగేశ్వర నాయక్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సమన్వయ అధికారి సురేష్, కలెక్టరేట్ ఏవో రాధిక తదితరులు పాల్గొన్నారు.

స్కానింగ్ కేంద్రాల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని జి.గీతాబాయి

విశాలాంధ్ర-మచిలీపట్నం : జిల్లా లో లింగ నిర్ధారణ ఎంపిక నిషేధ చట్టంను పటిష్టంగా అమలు చేస్తున్నామని, స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని జి గీతాబాయి హెచ్చరించారు. మంగళవారం మచిలీ పట్నంలోని శ్రీ సాయి రక్షిత స్కానింగ్ కేంద్రాన్ని రాజీవ్ స్కానింగ్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని అన్ని స్కానింగ్ కేంద్రాలను తప్పనిసరిగా పిసిపిఎన్డిటి చట్టం పరిధిలో నమోదు చేయవలసినదిగా తెలియజేసినారు. ఎవరైనా లింగ నిర్ధారణ ఎంపిక నిషేధ చట్టాన్ని ఉల్లంఘించినట్లయితే వారిపై చట్టరీత్యా తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేసినారు . అవసరమైతే ఐఎంఏ గుర్తింపును కూడా రద్దు చేస్తామని, ముఖ్యంగా జిల్లాలో తక్కువ లింగ నిష్పత్తి గల ప్రాంతాలను గుర్తించి క్షేత్రస్థాయి సిబ్బంది ద్వారా ప్రజలలో అవగాహన కల్పించటం జరుగుతుందని తెలియజేసినారు . స్కానింగ్ కేంద్రాలకు సంబంధించిన అనుమతులన్నీ కచ్చితంగా ఉండాలని తెలియజేసినారు. స్కానింగ్ కేంద్రాల వారు తమ కేంద్రాలకు వచ్చిన గర్భవతులు యొక్క పూర్తి వివరాలను మరియు అనుమతిని తీసుకొని మాత్రమే స్కానింగ్ నిర్వహించాలని తెలిపారు. సంస్థల వారందరూ తప్పనిసరిగా క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్. ఏపీ. జీఓవి.ఇన్లో ఆన్లైన్ పోర్టల్ ద్వారా నమోదు చేయాలని, నమోదు చేయకుండా ఏర్పాటు చేసినటువంటి సంస్థలపై చట్టరీత్యా తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విద్యా బోధకుడు బి. రాజేంద్ర కుమార్ పాల్గొన్నారు.

అంగన్వాడిల డిమాండ్లు పరిష్కరించాలి

విశాలాంధ్ర-కూచిపూడి : అంగన్వాడీ సిబ్బంది వేతనాలు పెంపు, గ్రాడ్యుటీ ,పెన్షన్ అమలు తదితర సమస్యల పరిష్కారం కోసం డిసెంబరు 12 నుంచి నిర్వహించే నిరవధిక సమ్మెలో భాగంగా మొవ్వ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని మొవ్వ, ఘంటసాల, చల్లపల్లి మండలాలలోనిఅంగన్వాడీ కేంద్రాల సిబ్బంది మంగళవారం నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగామొవ్వ సిడిపిఓ కార్యాలయం వద్దకు తరలి వచ్చిన సిబ్బంది నినాదాలు చేస్తూ నిరసనలు తెలియజేశారు.. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి, సిఐటియు, ఐఎఫ్టియు అనుబంధ అంగన్వాడీ యూనియన్ నేతలు, సిబ్బంది పాల్గొన్నారు.

ధర్నాతో కూడిన సమ్మె

మొవ్వ ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడి కార్యకర్తలు,వర్కర్లుతమ న్యాయమైన కోరికలు పరిష్కరించాలంటూ మొవ్వ ఐసిడిఎస్ కార్యాలయం ముందు మంగళవారం ధర్నా తో కూడిన సమ్మె నిర్వహించారు. తమ సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని విమర్శించారు. వేతనాలు పెంచాలని గ్రాట్యూటీ అమలు చేయాలని ప్రభుత్వాలకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీనినెరవేర్చాలని తెలంగాణ ప్రభుత్వం కన్నాఅదనంగా జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఐసిడిఎస్ కార్యకర్తలు, వర్కర్లకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు పెంచాలని.. మార్చాలని.. ఆఖరి జీవితంలో 50% పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో యూనియన్ నేతలు పాల్గొన్నారు

బంటుమిల్లిలో...

బంటుమిల్లి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆఫీసు ముందు అంగనవాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వాళ్ల డిమాండ్లపై మంగళవారం నిర్వాధిక సమ్మె చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధ్యక్ష కార్యదర్శులు గోపి లక్ష్మి నాగేంద్ర కుమారి శ్రీదేవి వితలేశ్వరి గ్రేస్ గీత పార్వతి కమల మేరీ గ్రేస్ శ్రీదేవి సామ్రాజ్యం అజయ్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

కష్టానికి తగ్గ వేతనం చెల్లించాలి

విశాలాంధ్ర-గన్నవరం : అంగన్వాడీ సిబ్బందికి కష్టానికి తగ్గ వేతనం చెల్లించాలని సిఐటియు కార్యదర్శి కళ్ళం వెంకటేశ్వరవు రాష్ట్ర ప్రభుత్వాని డిమెండ్ చేశారు. మంగళవారం గన్నవరం సీడీపీఓ కార్యాలయం ఎదుట అంగన్వాడీ కార్యకర్తలు ఆయాలు ధర్నా నిర్వహించారు. అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని లేని పక్షము సమ్మె మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

గౌరవ వేతనం కాదు కనీసం వేతనం ఇవ్వాలి : వెనిగండ్ల రాము

విశాలాంధ్ర-గుడివాడ : జగన్ మోహన్రెడ్డి ఎంతో కలంగా అంగన్వాడీలతో వేట్టి చాకిరి చేయిస్తు గౌరవవేతనం ఇవ్వం దారుమాని వెంటనే వారికి కనీసం వేతనం ఇవ్వాలని టీడిపి ఇన్ చార్జి వెనిగండ్ల రాము అన్నారు. బుధవారం స్థానిక ఐసిడియస్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు చేస్తున్న ధర్నాలో వెనిగండ్ల రాము పాల్గొని వారికి సఖీభావం తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అంగన్వాడీల వ్యవస్థను ఏర్పాటు చేసి పేద మహిళకు ఉపాధి కల్పించడం జరిగిందన్నారు. జగన్ ప్రభుత్వం వచ్చిన తరువాత అంగన్వాడీలకు కనీస వేతనం ఇవ్వకుండా మోసం చేస్తున్నరన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, వర్కర్లు, పాల్గొన్నారు.

నల్లమోతు ప్రకాశరావు మృతికి వేదవ్యాస్ దిగ్భ్రాంతి

విశాలాంధ్ర-పెడన : పూర్వపు బంటుమిల్లి సమితి మాజీ అధ్యక్షులు కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ నల్లమోతు కోటి సూర్య ప్రకాశరావు మృతి పట్ల మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సుదీర్ఘకాలంగా ప్రజా జీవితంలో గడిపిన ప్రకాశరావుకు గ్రామీణ సమస్యల పట్ల మంచి అవగాహన ఉందన్నారు. తమ కుటుంబంతో ఆయనకు ఉన్న సన్నిహిత సంబంధాలను వ్యాస్ గుర్తు చేసుకున్నారు. ఇటీవల ఆయనను చేవెంద్ర లో కలసి యోగక్షేమాలు తెలుసుకున్నానని ఆ సందర్భంగా ఆయన తన పట్ల చూపిన అభిమానాన్ని మరచిపోలేను అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు తెలిపారు. బుధవారం నాడు ప్రకాశరావు అంత్యక్రియలకు తాను హాజరవుతున్నట్లు తెలిపారు.

కదం తొక్కిన డీఎస్సీ అభ్యర్థులు

విశాలాంధ్ర-అవనిగడ్డ : అవనిగడ్డలో నిరుద్యోగ డిఎస్సి అభ్యర్థులు కదం తొక్కారు మంగళవారం వేలాదిగా ఒక్క సారిగా తహశీల్దార్ కార్యాలయానికి వచ్చి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి ప్రతిపక్షంలో ఉండగా అధికారంలోనికి వచ్చిన వెంటనే మొదటి నెలలోనే మెగా డిఎస్సి ప్రకటిస్తానని హామీ ఇచ్చి నేటికి నాలుగున్నర సంవత్సరాలు దాటుతున్నప్పటికి డిఎస్సి నోటిఫికేషన్ ఇవ్వలేదని నిరసన వ్యక్తం చేశారు. తెలంగాణా ముఖ్యమంత్రి కేసీఆర్కు నిరుద్యోగులు ఏ విధంగా గుణపాఠం చేప్పారో 2024 ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డికి కూడా అదే రీతిలో గుణపాఠం గట్టిగా చెబుతామని ఉపాధ్యాయులను అత్యంత హీనంగా చూస్తున్న ప్రభుత్వం వైసిపి ప్రభుత్వం అని ఉపాధ్యాయులు ఉంటేనే భావి భవిష్యత్ తరాలకు బాసట కల్పిస్తారని, నేటి ముఖ్యమంత్రి అటువంటి ఉపాధ్యాయులతో పాటు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులను మోసం చేసిన జగన్మోహన్రెడ్డికి సరైన సమయంలో సరైన గుణపాఠం చెబుతామని డిఎస్సి అభ్యర్థులు తెలిపారు. నిరుద్యోగులకు మద్దతుగా మాజీ ఉపసభాపతి మండల బుద్ధప్రసాద్, ఉత్తరాంధ్ర పట్టభద్ర శాసనమండలి సభ్యులు చిరంజీవి రావ్, జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు, టిడిపి జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు మండలి రాజా, అవనిగడ్డ టిడిపి, జనసేన పార్టీ మండల అధ్యక్షులు యాసం చిట్టిబాబు, గుడివాక శేషుబాబు, ఉమ్మడి కృష్ణాజిల్లా జనసేన పార్టీ కార్యదర్శి కొండవీటి సునీత, కోడూరు మండల టిడిపి అధ్యక్షులు బండె శ్రీనివాసరావు, జిల్లా మాలమహానాడు అధ్యక్షుడు దోవాగోవర్ధన, జిల్లా టిడిపి ఎస్.సి సెల్ నాయకులు ఎం ఆదినారాయణ, ఎం.పి.టిసి సభ్యులు బొప్పన బాబు, లుక్కా పిచ్చయ్య లతో పాటు పెద్ద ఎత్తున నిరుద్యోగులు పాల్గోనగా జనసేన, టిడిపి నేతలు, అభిమానులు డిఎస్సీ అభ్యర్థులకు సంఘీభావం తెలిపారు.

విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరం

విశాలాంధ్ర-బంటుమిల్లి :- విద్యుత్ చౌర్యం చట్టరిత్యా నేరమని నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని విద్యుత్ శాఖ విజిలెన్స్ డి ఇ ఇ ఎన్ ఎం ప్రసాద్ తెలిపారు .మండల పరిదిలోని పలు గ్రామాలలోని విద్యుత్ వినియోగదారుల గృహాలపై మంగళవారం విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించరు . 35 బృందాలుగా ఏర్పడిన అధికారులు గ్రామాలలోని విద్యుత్ వినియోగదారుల గృహాలను ఏక కాలంలో తనిఖీలు నిర్వహించడం జరిగిందని బంటుమిల్లి విద్యుత్ శాఖాధికారి రవికుమార్ తెలిపారు .ఈ తనిఖీలలో అధిక విద్యుత్ ను వినియోగిస్తున్న 138 మందిని గుర్తించి వారి వద్దనుండి రూ.4 ,67 ,698 అపరాధ రుసుము కింద వసూలు చేసి ప్రభుత్వనికి ఆదాయాన్ని కల్పించినట్లు రవికుమార్ తెలిపారు. గ్రామాలలో ఎవరైన అక్రమంగా విద్యుత్ చౌర్యం చేస్తుంటే వారిని విద్యుత్ శాఖాధికారులకు తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఇ ఇ ఎం భాస్కరరావు, పెడన డిఇఇ మాణిక్యలరావు, మచిలీపట్టణం రూరల్ డి ఇ ఇ శ్రీనివాసరావు ,పామర్రు డి ఇ ఇ సుందరరావు మచిలీపట్టణం డివిజన్ పరిదిలోని మండలాల విద్యుత్ శాఖాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

విశాలాంధ్ర-కృత్తివెన్ను : అంత ర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని దివ్యాంగులకు ఆట వస్తువులను ఎంపీపీ కూనసాని గరుడ ప్రసాదు బహూకరించారు. తుఫాన్తో వాయిదా పడిన అంతర్జాతీయ దినోత్సవ వేడుకలను మంగళవారం నీలిపూడి గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన ఎంపీపీ కుమారుడు వంశీకృష్ణ జ్ఞాపకార్థం దివ్యాంగులకు ఆట వస్తువులను బహుకరించారు. దివ్యాంగులకు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని ఎంపీపీ హామీ ఇచ్చారు. దివ్యాంగులకు మానసిక బలం పెంపొంది విధంగా వారికి అభ్యాసన ప్రక్రియ ఉండాలని ఎంపీపీ సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పాశం కృష్ణ, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు పాశం సుబ్రమణ్యం, పుప్పాల రాము ఎంపీడీవో పిచ్చిబాబు, మండల విద్యాశాఖ అధికారి ప్రసాదు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలన్నీ ప్రాధాన్యత తో పరిష్కరిస్తా

విశాలాంధ్ర-పమిడిముక్కల: నియోజకవర్గం లో సమస్యలన్నీ ప్రాధాన్యత క్రమంలో పరిష్కారించాల్సిన ఉన్నదని మన ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రజల సమస్యలకే ప్రాధాన్యత ఇస్తున్నారని ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ అన్నారు.మంగళవారం తాడంకి లో వైఎస్సార్ పార్టీ ఆదేశానుసారం జడగన్ నీడ్స్ ఎ.పి.కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి చేసిన హామీలను అన్నీ మాటతప్పకుండా అమలు చేశారని తెలిపారు.తోలుత పార్టీ జెండా ఎగురవేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ జంపాన ధనలక్ష్మి, శొంఠి వెంకటేశ్వరరావు యేనుగ మస్తాన్ రావు వై.గణేష్ బాబు కోఆప్షన్ సభ్యులు దియానత్ అలి తహాశీల్దార్ డి. రాజ్యలక్ష్మి, యంపిడిఓ విఠల్ పాల్ పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి : డీఎస్పీ

విశాలాంధ్ర-మచిలీపట్నం : మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని, గొప్ప వ్యాపారవేత్తలుగా ఎదగాలని డిటిఎస్ డీఎస్పీ సురేష్బాబు వెల్లడించారు. మంగళవారం స్థానిక ఇనుకుదురు పేట అర్మాన్ అపార్ట్మెంట్ లో కాదిజా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని, మాట్లాడుతూ 40 రోజుల్లో ఇంత చక్కగా తక్కువ సమయంలో ఫ్యాషన్ డిజైన్లు నేర్చుకోవడం ఎంతో అభినందనీయమని, మహిళలు మీరు నేర్చుకున్న ఈ నైపుణ్యాన్ని ఆన్లైన్ విధానంలో అమ్మ కలిగితే రానున్న రోజుల్లో మంచి వ్యాపారవేత్తలుగా అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయని ఆయన అన్నారు. మీరు చేసిన ఈ ఫ్యాషన్ డిజైన్ షో రూంలో ఉంటే మంచి రేటు పలుకుతుందని, అలాగే మరికొన్ని ఫ్యాషన్స్ కూడా నేర్చుకుని మహిళలు ముందుకు వెళ్లాలని ఆయన అన్నారు. అనంతరం ఫ్యాషన్ డిజైన్ లో పాల్గొన్న మహిళలకు బహుమతులు,సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఖదీజా ఫౌండేషన్ ట్రస్టీలు సమన మోసవి, ఎండి అల్తాఫ్ హుస్సేన్, మొహమ్మద్ ఇమ్రాన్, షీ బా అబ్బాస్, సుమన్ ఫ్యాషన్ డిజైనర్ నసీం తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన

విశాలాంధ్ర-పెడన : పెడన నియోజవర్గ పరిధి లోని నాలుగు మండలాల తహసిల్దారులతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజ్యలక్ష్మి అవగాహన కల్పించారు. ఈ మేరకు పెడన తహశీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించి డమ్మీ ఈవెన్ లు ఎలా పనిచేస్తున్నాయని ప్రదర్శించారు. దీనిపై వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులను పిలిచి వారికి ఈవీఎం మిషన్ ఎలా పనిచేస్తుందో వివరించారు. అలాగే 25 రోజులపాటు నియోజకవర్గంలో ఓటు ఎలా వేయాలి ఈవీఎం మిషన్లతో ఓటింగ్ ఎలా నమోదు చేయాలని ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు

ఎస్సై శ్రీనివాస్ పనితీరు భేష్- డీఎస్పీ

విశాలాంధ్ర-ఘంటసాల : మండల కేంద్రమైన ఘంటసాల ఎస్సై కుడిపూడి శ్రీనివాస్ పనితీరు భేష్ అని అవనిగడ్డ డిఎస్పి పి. మురళీధర్ ప్రశంసించారు. మంగళవారం ఘంటసాల పోలీస్ స్టేషన్ను డి.ఎస్. పి మురళీధర్ తనిఖీ చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ ను ఎంతో పరిశుభ్రంగా ఉంచారని అంతేకాకుండా 2021- 22, 23 సంవత్సరానికి గాను రికార్డులు పరిశీలన, క్రైమ్ రేట్, కోర్టు కేసులు తదితర అంశాలపై రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. స్టేషన్ కి వచ్చే వారితో ఫ్రెండ్లీ పోలీస్ గా వ్యవహరించాలని ఎస్సై కుడిపూడి శ్రీనివాస్ కు సిబ్బందికి సూచనలు సలహాలు అందించారు ఆయనతోపాటు చల్లపల్లి సిఐ సిహెచ్ నాగప్రసాద్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ లో సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-ఘంటసాల: మండల కేంద్రమైన ఘంటసాల మండల ప్రజా పరిషత్ అభివృద్ధి కార్యాలయం నందు మండల అధ్యక్షురాలు వేమూరి రజిని కుమారి అధ్యక్షతన బుధవారం 2 గం"లకు సర్వసభ్య సమావేశం నిర్వహించినట్లు ఎంపీడీవో టి అనూహ్య తెలిపారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఈ సమావేశానికి సర్పంచులు, సెక్రటరీ లు, ఆర్డబ్ల్యూఎస్, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ విద్యుత్, ఇరిగేషన్, డ్రైనేజ్, శాఖల ఏఈల తో పాటు తదితర సిబ్బంది తప్పనిసరిగా హాజరు కావాలని ఎంపీడీవో అనూహ్య ఆదేశించారు.

భూ స్థితి నిజనిర్ధారణకు భూ రక్ష : సర్పంచి కృష్ణవేణి

విశాలాంధ్ర-బంటుమిల్లి :- దళారీ వ్యవస్థకు స్వస్తి పలుకుతూ పారదర్శకంగా ,నిష్పక్షపాతంగా అవినీతికి తావులేకుండా ఉండేందుకే ప్రభుత్వం వై ఎస్ అర్ జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్ష పథకాన్ని ప్రవేశపెట్టిందని బంటుమిల్లి గ్రామ సర్పంచి స్టునం కృష్ణవేణి అన్నారు . జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్ష పథకం పై మంగళవారం బంటుమిల్లి గ్రామ సచివాలయం వద్ద గ్రామస్థులతో గ్రామ సర్పంచి కృష్ణవేణి సమక్షంలో రెవెన్యూ అధికారులు గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచి కృష్ణవేణి మాట్లడుతూ బ్రిటీష్ పరిపాలన కాలంలో బ్రిటిషు వారు ఏర్పాటుచేసిన భూ హద్దులే ఆధారంగా నేటివరకు సాగుతుందన్నారు .వాటిని మరల భూ సర్వే చేసి భూ యజమానులకు శాశ్వత భూ హక్కు పత్రాన్ని అందించాలని లక్ష్యంతో వై ఎస్ అర్ జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్ష పథకాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి చేపట్టిన మహాయజ్ఞం అన్నారు. ఈ గ్రామసభలో రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ ఆంజనేయులు ,మండల సర్వేయర్ పి శ్రీనివాసరావు, గ్రామ సర్వేయర్ మాగంటి అనిల్ కుమార్ ,సచివాలయ కార్యదర్శి బొల్లా వెంకన్న ,గ్రామప్రజలు ,సచివాలయ సిబ్బంది పాల్గోన్నారు.

క్రీడా కిట్లు పంపిణీ

విశాలాంధ్ర-పెదపారుపూడి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన "ఆడుదాం ఆంధ్ర" ఈనెల 15వ తేదీ నుండి 2024 ఫిబ్రవరి 3వ తేదీ వరకు మండలంలో జరగబోతున్న క్రికెట్, వాలీబాల్, షటిల్ బ్యాట్మెంటన్, కబాడీ, తదితర ఆటలను ఆడటానికి క్రీడా కిట్లను ఎంపీపీ గోగం సురేష్ వైసిపి సేవా విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గోళ్ల సోమేశ్వరరావు, ఎంపీడీవో టి సీతామహాలక్ష్మి, చేతుల మీదుగా మండలంలోని అన్ని సచివాలయాలకు మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏవో రమణ రావు, సిఓ ఏసుబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రకు నమోదు చేయించండి

విశాలాంధ్ర-పెదపారుపూడి : ఆడుదాం ఆంధ్రకు సంబంధిత అధికారులు నమోదు చేయించాలని ఎంపీడీవో టీ సీతామాలక్ష్మి, తహసిల్దార్ వి నాగభూషణం మంగళవారం అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన ఆడుదాం ఆంధ్ర విజయవంతంగా నిర్వహించడానికి గ్రామీణ ప్రాంతాలలో 15 ఏళ్లు దాటిన స్త్రీ పురుషులను గుర్తించి నమోదు చేయించాలని ఎంపీడీవో అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రాణ రక్షణ కల్పించాలి - సిరింగుల

విశాలాంధ్ర-గుడివాడ : 2017లో పశ్చిమ గోదావరి జిల్లా పాలకోడేరు మండలంలోని గరగపర్రు లో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ఠ విషయం లో జరిగిన గోడవలకు కారణమైన బలరామకృష్ణం రాజును అరెస్టులు చేశారని, నేడు నన్ను కేసు నుండి ఉపసంహరించుకోకపోతే నా కుటుంబన్ని హతమారుస్తాను అన్ని బెదిరించారని, పోలీసులు తన కుటుంబానికి రక్షణ కల్పించాలని గరగప్రరు ఉద్యమ నాయకుడు జైభీమ్ పీపుల్స్ రాష్ట్ర అధ్యక్షుడు సిరింగుల వెంకటరత్నం కోరారు. బుధవారం స్థానిక శ్రీలేఖ హటల్లోని ఫంక్షన్హాల్లో మాట్లాడుతూ గరగప్రరులో జరిగిన విషయంలో ఇందుకూరి బలరామకృష్ణంరాజు తనపై కక్ష పెట్టుకుని కేసు నుండి ఉపసంహరించుకోక పోతే తన కుటుంబాని, తనను సుపారీ ఇచ్చి హతమారుస్తాని బెదిరిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం వెంటనే తనకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.రాజీవ్బాబు తదితరులు పాల్గొన్నారు.

రాజు కుటుంబానికి కుమార్ రాజా పరామర్శ

విశాలాంధ్ర-పెదపారుపూడి : మండలంలోని నాగపురం గ్రామంలో గుడివాడ రాజు అనే వ్యక్తి ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ పామర్రు నియోజకవర్గ ఇన్చార్జి వర్ల కుమార్ రాజా ఆ గ్రామంలోని రాజు స్వగృహంలో మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసి ఆర్థిక సహాయం మంగళవారం అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల శాఖ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, నాగాపురం గ్రామ పార్టీ అధ్యక్షుడు నాగదేసి విజయ ప్రకాష్, దోసపాడు గ్రామ పార్టీ అధ్యక్షుడు సజ్జ శివకుమార్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

-సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి
- రేపు లెనిన్ సెంటర్‌లో అఖిలపక్షాలు, రైతు సంఘాలు నిరసన

విశాలాంధ్ర-విజయవాడ : కరువు, తుపాన్‌లతో పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ డిమాండ్ చేశారు. స్థానిక దాసరి భవన్‌లో మంగళవారం అఖిలపక్షం నేతలు, రైతు సంఘాల నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మిచౌంగ్ వల్ల 40వేల ఎకరాల్లో పంట నీటమునిగిందని చెప్పారు. ఈ మేరకు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఈ నెల 14వ తేది గురువారం ఉదయం విజయవాడ లెనిన్ సెంటర్‌లో అఖిలపక్షం, రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. ఆరబెట్టిన ధాన్యం తడిసి రంగు మారిందని, మిరప పంట వరదల కారణంగా నీటి మునిగి రంగుమారి పనికి రాకుండా పోయిందన్నారు. ఇలాంటి దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్న రైతాంగాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. వరి పంట ఎకరాకు రూ.30వేలు, మిరపకు రూ50వేలు, ఉద్యాన వన పంటలకు రూ.75వేల రూపాయలచొప్పున నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు లింగమనేని శివరామ్‌ప్రసాద్ మాట్లాడుతూ నష్టపోయిన పంటలను గుర్తించి అక్రమాలు జరగకుండా ఎన్యూమరేషన్ చేయాలని డిమాండ్ చేశారు. తడిసిన, రంగుమారిన, మొలకెత్తిన ధాన్యాన్ని రంగు మారిన పత్తిని ఎటువంటి నిబంధనలు లేకుండా ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ విజయవాడ నగర అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మల్నీడి యల్లమందారావు, కృష్ణాడెల్టా పరిరక్షణ సమితి నాయకులు కొలనుకొండ శివాజీ, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ నాయకులు డి.హరినాథ్ తదితరులు మాట్లాడారు. ఈసమావేశంలో సీపీఐ ఎన్టీఆర్ జిల్లా సహాయ కార్యదర్శి బుడ్డి రమేష్, విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు కొట్టు రమణారావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు బొర్రా కిరణ్, టీడీపీ నాయకులు పరిశపోగు రాజేష్, ఎంసీపీఐ(యూ) నాయకులు ఎస్‌కే.సలీమ్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పై స్పందించేది ఎర్రజెండానే

విశాలాంధ్ర-విజయవాడ : ప్రజా సమస్యలపై స్పందించి పరిష్కరించేది కమ్యూనిస్టు పార్టీలేనని సీపీఐ నగర కార్యదర్శి జి. కోటేశ్వరరావు అన్నారు. మంగళవారం జరిగిన 6వ డివిజన్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సీపీఐ 6వ డివిజన్ శాఖ సమావేశం బర్రె సత్యవతి అధ్యక్షతన పడాల సన్యాసిరావు గ్రంథాలయంలో జరిగింది. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ 98 సంవత్సరాల మహోత్సవాల చరిత్ర కలిగిన భారత కమ్యూనిస్టు పార్టీ దేశంలో అనేక విముక్తి ఉద్యమాలకు నాయకత్వం వహించిందని, ప్రజల మౌలిక సదుపాయాల కల్పనలో ప్రముఖ పాత్ర వహించిందన్నారు. విజయవాడ నగరంలో 99వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు అప్పురబోతు రాము, ఇజ్జాడ లక్ష్మి, డివిజన్ పార్టీ కార్యదర్శి పడాల కనకారావు, సహాయ కార్యదర్శి పందిరి నూకరాజు, అసిరి నాయుడు, రాజారావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ముందుగా ఇటీవల మరణించిన సీపీఐ కేరళ రాష్ట్ర కార్యదర్శి కణం రాజేంద్రన్‌కు సమావేశం శ్రద్ధాంజలి ఘటించింది.

విశాలాంధ్ర
ఎన్టీఆర్ జిల్లా

రౌడీ షీటర్లపై నిఘా పెట్టండి

వెస్ట్ డివిజన్ పోలీసు అధికారులకు డీసీపీ విశాల్ గున్ని ఆదేశం

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): రౌడీ షీటర్ల పై నిఘా పెట్టాలని వెస్ట్ డివిజన్ పోలీసు అధికారులకు డీసీపీ విశాల్ గున్ని ఆదేశించారు. మంగళవారం విజయవాడ వెస్ట్ డివిజన్ పోలీసు అధికారులతో ఇబ్రహీపట్నం పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీ షీటర్ల పై నిఘా పెట్టి, ఎటువంటి నేరాలకు పాల్పడకుండా కౌన్సిలింగ్ నిర్వహించాలన్నారు. గ్రేవ్, పోక్సో, ఎస్సీఎస్టీ కేసుల్లో నిర్దేశిత సమయంలోగా చార్జ్‌షీట్ న్యాయస్థానంలో దాఖలు చేయాలన్నారు. వృద్ధులు, మిస్సింగ్ కేసులకు సంబంధించి కేసులను త్వరితగతిన చేయాలన్నారు. అక్రమ మద్యం, గంజాయి రవాణాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించి వారి సంఖ్య తగ్గించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదు దారుల పట్ల మర్యాదగా వ్యవహరించాలన్నారు. సిబ్బంది తమ విధుల్లో మెరుగైన పనితీరు చూపించాలన్నారు. మహిళా సంబంధిత కేసుల్లో ఎటువంటి ఆలసత్వం లేకుండా దర్యాప్తు వేగవంతం చేయాలన్నారు. బ్లేడ్ బ్యాచ్, గంజాయి సేవించే వారి పై నిఘా పెట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో వెస్ట్ ఏసీపీ డాక్టర్ హనుమంతరావు, సీఐలు సుబ్రమణ్యం, సురేష్‌రెడ్డి, కృష్ణ, శ్రీనివాస్‌లు, ఎస్సైలు పాల్గొన్నారు.

తిరువూరు అభివృద్ధిలో వీరభద్రరావు కృషి ఎనలేనిది

విశాలాంధ్ర-విజయవాడ(తిరువూరు) : తిరువూరు పట్టణ అభివృద్ధిలో సీపీఐ నేత సుంకర వీరభద్రరావు కృషి ఎనలేనిదని సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తూము కృష్ణయ్య అన్నారు. స్థానిక సుంకర వీరభద్రరావు భవన్ సీపీఐ తిరువూరు పట్టణ సమితి ఆధ్వర్యంలో సుంకర వీరభద్ర రావు 33 వ వర్ధంతి సభ జరిగింది. సీపీఐ తిరువూరు పట్టణ కార్యదర్శి మాలపాటి ఉదయ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సంతాప తీర్మానంలో ఇటీవల మృతి చెందిన సొబ్బల గ్రామానికి చెందిన పున్నం లక్ష్మయ్య, విస్సన్నపేట గ్రామంలో మహిళ నాయకురాలు గోలి నాగమణి వీరురువురికి నియోజకవర్గ పార్టీ మౌనం పాటించి సంతాపం తెలిపారు. ఈ సభలో వీరభద్ర రావుని ఉద్దేశించి కృష్ణయ్య మాట్లాడుతూ ఆదర్శ కమ్యూనిస్టు నిష్కలంక కమ్యూనిస్టు యోధ, తూర్పు కృష్ణ డెల్టా ప్రాంతంలో పుట్టి పెరిగి కాంగ్రెస్ కార్యకర్తగా తిరువూరు తాలూకాలో అడుగుపెట్టి స్వతంత్ర పోరాటంలో బలమైన ఉద్యమాలు నడిపి స్వతంత్రం వచ్చిన తదుపరి భారత కమ్యూనిస్టు పార్టీ తిరువూరు నియోజకవర్గంలో ఏర్పాటు చేయడంలో ప్రధాన పాత్ర వహించారు వివరించారు. తిరువూరు నియోజకవర్గ కార్యదర్శి ఎస్‌కే నాగుల్ మీరా మాట్లాడుతూ తిరువూరు నియోజకవర్గ అభివృద్ధి కోసం సంబంధిత అధికారులతో బైపాస్ రోడ్డు నిర్మాణం, బస్టాండ్ నిర్మాణం అభివృద్ధిలో వీరభద్ర రావు గారి సలహా సూచనలతోనే తిరువూరు పట్టణ కొద్ది అభివృద్ధి అయినా జరిగింది అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు ఎస్కే సుభాని టౌన్ కమిటీ సభ్యులు పల్లపు మురళి హసన్ బాణాల అశోక్ ఎస్కే మస్తాన్ కార్పెంటర్ మీరా అయినాల ముత్తయ్య, మేదేపల్లి నరసింహారావు, పాలకుర్తి సునీల్, సత్యం, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

విస్సన్నపేట, ఏ.కొండూరు మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలి

తిరువూరు నియోజకవర్గంలోని విస్సనపేట, ఏ.కొండూరు మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తూము కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ తిరువూరు నియోజకవర్గ కమిటీ సమావేశం నృసింహాద్రి వనమాలి అధ్యక్షతన మంగళవారం స్థానిక వీరభద్రరావు భవన్‌లో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్నటువంటి ప్రజా వ్యతిరేక విధానాల మీద తీవ్రంగా ఆగ్రహించారు. తిరువూరు నియోజకవర్గ పార్టీ కార్యదర్శి ఎస్కె నాగూర్ మీరా మాట్లాడుతూ రాష్ట్రంలోనే ముందస్తుగా ప్రకటించాలని తిరువూరు నియోజకవర్గాన్ని కరువు ప్రాంతాలుగా ప్రకటించాలని నాలుగు మండలాల ఉద్యమాలు చేయడం వలన తిరువూరు, గంపలగూడెం మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించి వైసీపీ ప్రభుత్వం చేతులు దులుపుకుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు చిలుకూరు వెంకటేశ్వరరావు, సీపీఐ గంపలగూడెం మండల కార్యదర్శి ఉన్నం సాంబశివరావు, విస్సన్నపేట మండల కార్యదర్శి ఎం. త్యాగరాజు, తిరువూరు నగర కార్యదర్శి మాలపాటి ఉదయ్, ఏఐటీయూసీ నాయకులు కార్పెంటర్ మీరా తదితరులు పాల్గొన్నారు.

కృష్ణానదిపై బ్రిడ్జి నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ పూర్తి

-ఫలించిన ఉదయభాను కృషి
-త్వరలో పనులు ప్రారంభం

విశాలాంధ్ర-జగ్గయ్యపేట : జగ్గయ్యపేట మండలం లోని ముక్త్యాల గ్రామం వద్ద కృష్ణానదిపై బ్రిడ్జి నిర్మాణానికి వడివడిగా అడుగులు పడుతున్నాయి.స్థానిక శాసన సభ్యులు, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను కృషికి ఫలితం దక్కనున్నది. జగ్గయ్యపేట నియోజకవర్గ ప్రజల చిరకాల వాంఛ త్వరలో నెరవేరనుంది. పేటకు మరింత గుర్తింపు రానున్నది. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట నియోజకవర్గంలోని ముక్త్యాల వద్ద కృష్ణానదిపై నుంచి పల్నాడు జిల్లా మాదిపాడు వరకు రెండు జిల్లాలను కలుపుతూ సుమారుగా రూ. 60 కోట్లతో నిర్మించే బ్రిడ్జి కోసం టెండర్ల ప్రక్రియ పూర్తయింది. ఇక త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి. ఈ బ్రిడ్జి నిర్మాణం వల్ల ఇరు జిల్లాల ప్రజలకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. సుమారు 80 కిలో మీటర్ల దూరం తగ్గనుంది. వ్యాపారానికి ప్రసిద్ధి అయిన జగ్గయ్యపేట ప్రాంతం హైవేకు అనుసంధానం కాకపోవడంతో గుర్తింపులో వెనుకబడింది. బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే పేటకు మరింత వన్నె రానున్నది. వ్యాపారపరంగా విస్తృతమయ్యే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. అంతేకాకుండా హైదరాబాద్ నుంచి చిత్తూరు వంటి రాయలసీమ జిల్లాలకు కూడా దూరం తగ్గుతుంది. దీనివల్ల ప్రయాణ భారం తగ్గడంతో పాటు చాలా ప్రాంతాలకు వెళ్ళడం సులువవుతుంది. జగ్గయ్యపేట నియోజకవర్గ ప్రజలు ఎన్నాళ్ళ నుంచో ఈ బ్రిడ్జి నిర్మాణం కోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను చొరవతో బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన, టెండర్ల ప్రక్రియ పూర్తి అవ్వడంతో నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

'ఆంధ్రప్రదేశ్‌కు జగనే సీఎం ఎందుకు కావాలి'

విశాలాంధ్ర-గంపలగూడెం : సచివాలయం : 2 పరిధిలో ఆంధ్రప్రదేశ్ కు జగనే ఎందుకు కావాలంటే అనే కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన సంక్షేమ కార్యక్రమాల డిస్ప్లే బోర్డును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల జెడ్పిటిసి కోట. సామ్యూల్ ,గ్రామ సర్పంచ్ కోట .పుల్లమ్మ, గ్రామ కార్యదర్శి గోగిరెడ్డి. శ్రీనివాసరెడ్డి ,వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు చేరుకు. నరసారెడ్డి, గోగులమూడి. చెన్నకేశవరెడ్డి , ఎంపీటీసీ సభ్యులు ,స్థానిక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ,కార్యకర్తలు, వివిధ గ్రామాల సర్పంచులు , ఎంపీటీసీ సభ్యులు, ప్రభుత్వ ఉద్యోగులు, సచివాలయ కన్వీనర్స్, గృహ సారథులు, వాలంటీర్స్, ఆశ వర్కర్లు, సచివాలయ సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్ర కిట్ల పంపిణీ

విశాలాంధ్ర-గంపలగూడెం : మండలంలో మంగళవారం సీఎం జగన్మోహన్ రెడ్డి మానస పుత్రిక ఆడుదాం ఆంధ్ర ఈనెల 15వ తారీకు నుండి ప్రారంభం సందర్భంగా మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎంపీపీ గోగులమూడి. శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో ఎంపీడీవో నాగేశ్వరావు కలిసి ఆడుదాం ఆంధ్ర క్రీడా కిట్లు పంపిణీ సచివాలయ సిబ్బందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి కోట .శామ్యూల్, మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ సర్పంచులు, ఎంపీటీసీలు, పిఎసిఎస్ అధ్యక్షులు, పాల్గొన్నారు..

గెట్ టుగెదర్ కోసం ప్రత్యేకంగా ప్లాటినం ఎవారా

విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట : వివాహాది శుభకార్యాలకు, ఇయర్ ఎండింగ్ సేల్, క్రిస్మస్ నూతన సంవత్సరం వేడుకలు, గెట్ టుగెదర్ ల కోసం విలక్షణంగా ప్రత్యేకమైన ప్లాటినం ఎవారా ఎంతగానో ఉపయోగపడుతుందని సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సీజన్లో ప్రత్యేకమైన ప్లాటినం ఆభరణాలు మీ స్టైల్ ను మరింత మెరుగు పరుస్తాయన్నారు. ఈ తరం మహిళలకు ఎంతో హుందాగా ఉండి, 95 శాతం స్వచ్ఛతతో కూడి ప్లాటినం ఎవారా కొత్త సేకరణలో ఆకర్షణీయమైన నక్లెసులు, మణికట్టు నుంచి క్లిష్టమైన చెవి పోగులు సొగసైన రింగుల వరకు అనేక రకాల డిజైన్లు అందుబాటులో ఉంటాయన్నారు. ఏ సందర్భానికైనా ఇవీ అందంగా ఉంటాయని వీటిని వివిధ రకాలుగా అలంకరించుకోవచ్చని వివరించారు.

ఏపీకి రూ.50 లక్షల సాయాన్ని అందించిన టీవీఎస్ మోటర్ కంపెనీ

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): భారతదేశంలోని మూడవ అతిపెద్ద ద్విచక్ర వాహన సంస్థ టీవీఎస్ మోటర్ కంపెనీ, రాష్ట్రంలో విపత్తు సహాయక చర్యలకు రూ. 50 లక్షల విరాళాన్ని అందించింది. ఈ చురుకైన చర్య కార్పొరేట్ సామాజిక బాధ్యత పట్ల కంపెనీ యొక్క అంకితభావాన్ని, సంక్షోభ సమయాల్లో కమ్యూనిటీలకు మద్దతు ఇవ్వడానికి కంపెనీకున్న నిబద్ధతను నొక్కి చెబుతుంది. ఆంధ్రప్రదేశ్ లో ఇటీవల సంభవించిన విపత్తు వల్ల ప్రతికూలంగా ప్రభావితమైన వారికి తక్షణ సహాయం, పునరావాసం అందించడానికి ఈ నిధులు వినియోగించబడతాయని టీవీఎస్ మోటర్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ సుదర్శన్ వేణు తెలిపారు.

బాలుడికి విద్యుత్ షాక్

50వ డివిజన్‌లో ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

విశాలాంధ్ర-విజయవాడ (వన్ టౌన్): విజయవాడ 50వ డివిజన్‌లో పెను ప్రమాదం తప్పింది. బాలుడికి విద్యుత్ షాక్ తగలింది. తీవ్రగాయంతో ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ ఘటన విజయవాడ 50వ డివిజన్‌లో జరిగింది. సేకరించి వివరాల ప్రకారం స్థానికంక నివాసముండే శశివర్ధన్(5) కామరాజు వీధిలో రోడ్డు కు దిగువ ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను అడుకుంటూ పట్టుకున్నాడు. దీంతో ఒక్కసారిగా విద్యుత్ షాక్ తగిలింది. వెంటనే స్థానికులు పరుగులు తీసి బాలుడిని తీసుకుని ప్రథమ చికిత్స చేసి, ఆస్పత్రికి తరలించారు. గతంలో కూడా ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను పట్టుకుని ఓ బాలుడు చేతిని తొలగించడం జరిగిందని స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న డివిజన్ టీడీపీ అధ్యక్షులు కుప్పల గంగాధర్ ఘటన స్థలానికి చేరుకుని బాలుడిని పరామర్శించారు. విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీరింగ్‌కు సమాచారం అందించారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ ట్రాన్స్‌ఫార్మర్ కిందకు ఉండటంతో చిన్నారులు పట్టుకుటున్నారని, రోడ్డుకు దిగువ ఉన్న ఈ ప్రమాదకరమైన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎత్తున పెట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.

మానసిక ఆరోగ్య బోర్డు పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : స్థానిక సిద్దార్థ ప్రభుత్వ వైద్య కళాశాలలోని మానసిక ఆరోగ్య పరిశీలన బోర్డులో పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.సుధాకర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. చైర్‌పర్సన్-1, సభ్యులు-2, డీఈఓ-1, అటెండర్-1 మొత్తం 5 పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. అభ్యర్థులు పూర్తి వివరాలకు వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

17వ ఇంటింటికి వైసీపీ కార్యక్రమం

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : కృష్ణలంక 17వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి ఆధ్వర్యంలో మంగళారం ఇంటింటికి వైసీపీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డివిజన్‌లోని 79వ సచివాలయం పరిధిలో జరిగిన కార్యక్రమంలో సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులకు చేకూరిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా స్థానికులను సమస్యలడిగి తెలుసుకున్నారు.

'జగన్నకు చెబుదాం'పై సమీక్ష

విశాలాంధ్ర-వీరులపాడు: ఈ నెల 15 న వీరులపాడు మండలం జుజ్జూరు గ్రామం లో నిర్వహించనున్న "జగన్నకు చెబుదాం" కార్యక్రమం నిర్వహణ పై ఆర్డీవో సాయిబాబు మండల రెవిన్యూ సిబ్బందితో సమీక్షా సమావేశం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించారు.కార్యక్రమం సజావుగా సాగేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలు, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా వుండేలా చూడాలని సిబ్బంది కి సూచనలు చేసారు. ఈ నెల 15 న నిర్వహించబోవు కార్యక్రం జుజ్జూరు గ్రామంలోని జల్లి ఏసోబు కమ్యూనిటీ హాలునందు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఆర్డీవో సాయిబాబు మాట్లాడూతూ ప్రజా సమస్యలను మరింత సంతృప్త స్థాయిలో పరిష్కరించాలనే లక్ష్యంతో ప్రభుత్వం "జగనన్నకు చెబుదాం" కార్యక్రమాన్ని ప్రారంభించిందని, ఈ కార్యక్రమానికి కలెక్టర్లు,జిల్లా అధికారులు స్వయంగా హాజరై వినతులు స్వీకరించి వాటిని పరిస్కరిస్తూ ప్రజలకు భరోసా కల్పిస్తారని తెలిపారు.ప్రజలు మండల కేంద్రాలకు వెళ్లి కలెక్టర్లను కలిసి తమ సమస్యను తెలియపరిస్తే సమస్యను పరిస్కరించటాని చొరవ చూపిస్తారు.ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను,వినతులనుఅధికారులు అదేరోజు "జగనన్నకు చెబుదాం" పోర్టల్లో నమోదు చేస్తారని ఆయన తెలిపారు.ఈకార్యక్రమం లో మండల తహశీల్దార్ ఆశయ్య,ఎంపీడీఓ అరుందతీ దేవి, అర్ఇ శివ కుమార్ , విఆర్వో లో తదితరులు పాల్గొన్నారు.

క్రీడోత్సవాల ఏర్పాట్లు పూర్తి చేయాలి : జేసీ

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈనెల 15వ తేదీ నుంచి నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్ర క్రీడోత్సవాల ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డా.పీ.సంపత్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆడుదాం ఆంధ్ర క్రీడోత్సవాల సన్నద్ధతపై స్థానిక జేసీ కార్యాలయం నుంచి జేసీ మంగళవారం జిల్లా, మండల ప్రత్యేకాధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోటీల్లో పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉన్నందున ఇంకా ఎవరైనా ఔత్సాహికులు ఉంటే వారు కూడా గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో రిజిస్ట్రేషన్ చేయించుకునేలా చూడాలన్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో పోటీల కేటగిరీలో క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలు జరుగుతాయని, ఇందులో భాగంగా తొలిదశలో గ్రామ స్థాయిలో పోటీల నిర్వాహణకు మార్గదర్శకాలకు అనుగుణంగా జట్లు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే జిల్లా నుంచి మండలాలకు క్రీడా సామాగ్రి చేరుకున్నందున అక్కడి నుంచి గ్రామ సచివాలయాల స్థాయి ప్రత్యేకాధికారులకు సామాగ్రి అందజేసి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఈ కాన్ఫరెన్సులో చీఫ్‌కోచ్ ఎస్ఏ.అజీజ్, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

ఉరేసుకొని వివాహిత మృతి !

విశాలాంధ్ర-నందిగామ: నందిగామ రైతుపేట సెంటర్లో సోమవారం రాత్రి వివాహిత మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం సోమవారం రాత్రి నందిగామ రైతుపేటలో అద్దెకు ఉంటున్న ఇంటిలో విశ్వనాథ మల్లికం భార్య స్వర్ణభార్గవి (21) తన చున్నితో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని మృతిచెందింది. ఈ విషయమై నందిగామ పోలిసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఓటు హక్కుపై అవగాహన పెంచుకోండి

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: ప్రతి ఒక్కరూ ఓటు హక్కుపై అవగాహన పెంపొందించుకోవటంతోపాటు, నిరక్షరాస్యులకు సైతం వివరించాలని అధికారులు సూచించారు. విస్సన్నపేటలో మంగళవారం నిర్వహించిన ఓటు హక్కు అవగాహన ప్రదర్శనలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఓటు వినియోగం, రాజ్యాంగంలో ఓటు వినియోగం యొక్క పాత్రపై వివరించారు. స్థానిక సిద్ధార్థ విద్యాసంస్థల నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు ఈ ప్రదర్శన కొనసాగింది. కార్యక్రమంలో తహశీల్దారు చంద్రశేఖర్, ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింటు ఎస్.టి.ఆర్ జిల్లా, విజయవాడ, భవానీపురం, కామకోటి నగర్, డోరు నెం.76-11-43బి కాపురస్తురాలు **కాకుమూరు నాగిరెడ్డి గారి భార్య కాకుమూరు రాజేశ్వరి గారి** యొక్క సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా..

నా క్లయింటు ఈ క్రింద పేర్కొనబడినటువంటి షెడ్యూలు దాఖలా స్థిరాస్తి ఫ్లాటును విజయవాడ వన్‌టౌన్, అబ్దుల్ ఖాదర్ వీధి, గాంధీహిల్ పోలీసు క్వార్టర్స్, ఫ్లాట్ నెం.బి-4 కాపురస్తురాలు **రేగండ్ల శ్రీనివాసరావు గారి భార్య శ్రీమతి రేగండ్ల శ్రీశాంతి గారి** వద్ద నుంచి క్రయమును పొందుటకు నిశ్చయించుకొని కొంత రొక్కం అడ్వాన్సుగా యిచ్చి అగ్రిమెంటు వ్రాసుకొని రిజిస్ట్రేషన్ చేయించు కొనుటకు సిద్ధముగా వున్నారు.

కనుక సదరు రిజిస్ట్రేషన్‌పై ఎవ్వరికైనా ఎటువంటి హక్కులు గాని, ఆక్షేపణలు గాని, అభ్యంతరములు గాని, తనఖాలు గాని, కోర్టు ఎటాచ్‌మెంట్లు గాని, అప్పుకు హామీలు వగైరా చెల్లదగు క్లెయిమ్‌లు వున్న ఎడల ఈ ప్రకటన తేదీనుండి 10 రోజులలోపుగా నాకు తగిన **ఆధారములతో లిఖిత పూర్వకముగా** రిజిష్టర్డు పోస్టు (తిరుగు రశీదుతో) ద్వారా తెలియపర్చవలెను. గడువు తదుపరి సదరు ఆస్తి నిర్వివాదమైన ఆస్తిగా పరిగణించి నా క్లయింట్ రిజిష్టరు చేసుకొనగలరనిన్నీ, తదుపరి వచ్చు ఆక్షేపణలు, అభ్యంతరములు నా క్లయింటును మరియు షెడ్యూలు ఆస్తిని ఏ విధముగానైననూ బైండ్ చేయజాలవని ముందుగా తెలియజేయడమైనది.

షెడ్యూలు:- ఎన్.టి.ఆర్ జిల్లా, విజయవాడ జిల్లా రిజిస్ట్రారు వారి యిలాకా, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియాలోని విజయవాడ సిటీ, భవానీపురంలో గల ఆంధ్రప్రదేశ్ హౌసింగ్ బోర్డు కాలనీలో గల ఆస్తికి రీ సర్వే నెం.60, ఎల్.పి. నెం. 44/82, ఎమ్.ఐ.జి. 1, బ్లాకు నెం.14, ఫ్లాట్ నెం.1, మున్సిపల్ వార్డు నెం. 3ఎ, అసెస్మెంటు నెం. 31527, న్యూ అసెస్మెంటు నెం. 81191, డోరు నెం.76-1-14/1ర్లు దాఖలా అనిర్దిష్టపు అవిభాజ్యపు జాయింటు హక్కు గల చ.గ. 51-22లు స్థలమున్నూ సదరు స్థలములోని గ్రౌండ్ ఫ్లోరులోని ఎమ్.ఐ.జీ. ఫ్లాటు నెం. 1రు దాఖలా ఫ్లాట్లుకు హద్దులు: **తూర్పు:** ఎమ్.ఐ.జీ. బ్లాకు నెం. 13రు, ఫ్లాట్ నెం.6రు దాఖలా ఆస్తి, **దక్షిణం:** ఎమ్.ఐ.జీ. బ్లాకు నెం. 11రు, ఫ్లాట్ నెం.6రు దాఖలా ఆస్తి , **పడమర:** ఎమ్.ఐ.జీ. బ్లాకు నెం. 14రు, ఫ్లాట్ నెం.6రు దాఖలా ఆస్తి, **ఉత్తరం:** పాథ్ వే.

యీ నాలుగు హద్దుల మధ్య చ.అ.534 - 33లు ఫ్లింతేరియా గల ఫ్లాట్, సదరు ఫ్లాటుకు అమర్చిన యావద్విశిష్ట కలప సామానులు, కరెంటు ఫిట్టింగ్స్, మీటరు, డిపాజిట్, సర్వీసు, టాయిలెట్స్, మున్సిపల్ వాటర్ ట్యాప్, దాని డిపాజిట్ వగైరాలతో సహా మరియు మిగిలిన ఫ్లాట్ల వారితో పాటు కామన్ జాయింటు హక్కులతో సహా.

కొల్లు కృష్ణ కిషోర్ కుమార్, బి.ఎస్.సి. బి.ఎల్.
న్యాయవాది,
గాంధీనగర్, విజయవాడ-3,
ఫోన్స్: 9849183148, 8919630195.
విజయవాడ, తేది : 11-12-2023

పేదలకు లంక భూముల పట్టాలు పంపిణీ

విశాలాంధ్ర-కంచికచర్ల : ఎన్టీఆర్ జిల్లా నందిగామ,కంచికచర్ల మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో లంక భూముల్లో పట్టాల పంపిణీ కార్యక్రమం లో ఇన్ ఛార్జి కలెక్టర్ సంపత్ కుమార్ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహన్ రావు పాల్గొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. గతంలో లంక భూములు క్రయవిక్రయాలు చేయకూడదని నిబంధన ఉండేది రాష్ట్ర ప్రభుత్వం ఆ నిబంధన సడలించి ఆ భూములు తనకా పెట్టుకోటానికి కానీ, ఇతరులకు అమ్ముకోవటానికి అవకాశం కల్పించింది తెలిపారు ఇప్పటికే సుమారు 6 లక్షల పట్టాలు పంపిణీ చేసినట్లు వారు తెలిపారు.ఈ పట్టాలు పంపిణీ చరిత్రలో లేదని ఇది జగన్ అన్న ప్రభుత్వం పేదలకు అందించు చున్నారని ఎమ్మెల్యే మొండితోక జగన్ మోహన్ రావు అన్నారు.రాని వారికి కూడా దశల వారి గా పంపిణీ చేస్తారని,చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు అధికారులు పాల్గొన్నారు.

విలేకరిపై దాడి చేయలేదు : వేమా సురేష్

విశాలాంధ్ర-కంచికచర్ల: కంచికచర్లకు చెందిన శివ అనే వ్యక్తి మీడియా ముసుగులో తనపై దాడి చేయకపోయినా, దాడి చేసినట్లు సృష్టించి తనపై అక్రమ కేసులు బనాయించాడని పట్టణ వైసిపి అధ్యక్షుడు, గ్రామ ఉప సర్పంచ్ వేమా సురేష్ బాబు ఆరోపించారు. మంగళవారం ఎంపిటీసి సభ్యురాలు వేమా రోజా రమణి, ఏఎంసీ వైస్ ఛైర్మన్ మాదుగుల శంకర్ తదితరులతో కలిసి సురేష్ బాబు తన కార్యక్రమంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ కంచికచర్లకు చెందిన శివ అనే వ్యక్తి రెండేళ్ల క్రితం వీరులపాడు మండలం జుజ్జూరు గ్రామానికి చెందిన దళితులపై దాడి చేసి గాయపరచటమే కాకుండా, నడిరోడ్డులో బాధితుడితో కాళ్ళు పట్టించిన సంఘటనలో ఎస్సీ, ఎస్టీ సెక్షన్‌లో ముద్దాయిగా ఉండి నెలరోజులపాటు జైలు జీవితం గడిపాడన్నారు. శివ కొంత కాలంగా యూట్యూబ్ విలేకరి గా చెప్పుకుంటూ కంచికచర్ల పరిసర ప్రాంతాల్లో చిరు వ్యాపారులు, వైసిపి నాయకులను బెదిరింపులకు గురి చేస్తున్నాడని ఆరోపించారు. యూట్యూబ్ విలేకరి ముసుగులో శివ అనే వ్యక్తి గత కొంతకాలంగా గ్రామంలో అధికార పార్టీ నాయకుడిగా, ఉప సర్పంచ్ గా తాను చేపట్టే కార్యక్రమాలకు అడ్డు తగులుతూ బెదిరింపులకు, దాడులకు ఉసిగొల్పుతూ, రెచ్చగొట్టే ధోరణితో వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. ఈ నెల 9న తన అనుచరుని బైక్ గురించి పోలీసు సిబ్బందితో మాట్లాడుతుండగా శివ అనే వ్యక్తి తన మొహంపై కెమేరా పెట్టి వీడియో తీసే ప్రయత్నం చేయగా, వీడియో తీయవద్దని చెయ్యి అడ్డుపెట్టి నిలువరించానన్నారు. ఎలాగైనా తనపై కేసు బనాయించాలని ఆలోచనతో శివపై తాను దాడి చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడన్నారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేయలేదంటూ విలేకరుల సంఘం పేరుతో కొంతమంది యూట్యూబ్ విలేకరులతో కలిసి సోమవారం కంచికచర్లలో నిరసన ప్రదర్శనచేసి, రాజకీయాలకు, వైసిపికి అంటగట్టే ప్రయత్నం చేశాడని సురేష్ ఆరోపించారు. దీనికి విలేకరుల సంఘం నాయకుడు, ప్రతిపక్ష నాయకులు వంత పాడటం విడ్డూరంగా ఉందన్నారు. దళితులపై దాడి చేసిన శివ అనే ముద్దాయి, తానేదో దాడిచేశానని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇవ్వటం విడ్డూరంగా ఉందన్నారు. విలేకరి ముసుగులో శివ కంచికచర్లలో ఓ కిరాణా వ్యాపారి గుట్కాలు అమ్ముతున్నాడని అతన్ని బెదిరించి వేలాది రూపాయలు డిమాండ్ చేయగా, ఇతని బెదిరింపులు తట్టుకోలేక ఆ వ్యాపారి కుటుంబం ఊరొదిలి పెట్టి వెళ్ళారన్నారు. వాస్తవానికి శివ అనే వ్యక్తి తనపై దాడి జరిగిందని మిగతా మీడియా మిత్రులకు మాయ మాటలు చెప్పి, నిరసన ప్రదర్శనకు తీసుకు వచ్చారన్నారు. శివకి, తనకు మధ్య జరిగిన సంఘటనను వైసిపికి, కులాలకు ముడి పెట్టే ప్రయత్నం, విలేకరుల సంఘం నాయకుడు చేశారని ఆరోపించారు. ఇది వైసిపికి ఎలాంటి సంబంధం లేదన్నారు. వాస్తవాలు తెలుసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో అనుమాల వాసు, శివా నాయక్, సుజని తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింట్ యన్.టి.ఆర్.జిల్లా, విజయవాడ, అజిత్‌సింగ్‌నగర్, నంజీవయ్య చౌక్, డోరు నెం. 42-81-1రు కాపురస్తురాలు లింగం రవి గారి భార్య లింగం యేసుదానం గారి సంజాయిషీ పొంది, యావన్మందికి తెలియచేయునది ఏమనగా సదరు లింగం యేసుదానం గారికి మేనత్తగారైన పులిమెల మరియమ్మ, భర్త: కుక్కలమూడి లాజరస్ గారి పేరుతో విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ వారు దీ. 29-12-2001వ తేదీన విజయవాడ జిల్లా రిజిస్ట్రార్ ఆఫీసులో 1వ పుస్తకం, ద.నెం.7144/2001రుగా రిజిస్ట్రేషన్ చేయించినట్టి సేల్‌డీడ్‌ను ఫోటోస్టాట్ తీయించుటకు గాను దీ.10-12-2023వ తేదిన వారి ఇంటి నుండి దాబాకొట్లు సెంటర్‌కు జిరాక్సు నిమిత్తం వెళుతుండగా మధ్యలో సదరు డాక్యుమెంటు గల కవరు పడిపోయినది. ఎంత వెతికిననూ దొరకలేదు. సదరు దస్తావేజును ఉపయోగించి ఎవరైనా ఎట్టి అన్యాక్రాంతములు చేసిననూ అవి ఏమియు చెల్లవనియూ మరియు సదరు డాక్యుమెంటును ఉపయోగించి ఎవరైనా ఏదైనా లావాదేవీలు జరిపినచో అట్టివారిపై సివిల్ మరియు క్రిమినల్ చర్యలు తీసుకోబడును అని ఈ ప్రకటన మూలంగా తెలియచేయడమైనది. సదరు డాక్యుమెంటు దొరికిన వారు క్రింది చిరునామాకు 07 రోజులలోపుల తెలియపరచగలరు. సదరు డాక్యుమెంటు దొరికినవారు మాకు గాని, మా క్లయింటుకు గాని అందజేసినచో తగిన బహుమతి ఇవ్వబడును.

ఇట్లు
వి.వి. బాపయ్య, న్యాయవాది,
డోర్‌నెం.26-6-6, పాపయ్యవీధి,
గాంధీనగర్, విజయవాడ-520003
Cell : 9603075838.
తేది : 12-12-2023
స్థలము : విజయవాడ